'పది' పరీక్షలు ప్రారంభం

- 11,394 మంది విద్యార్థులకు గానూ 11,376 మంది హాజరు
- మొదటి రోజు 99.84 శాతం నమోదు
- 64 కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

జగిత్యాల టౌన్, మార్చి 18: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు తెలుగు పేపర్-1 రెగ్యులర్ పరీక్ష 64 కేంద్రాల్లో నిర్వహించగా మొత్తం 11,394 మంది విద్యార్థులకు గానూ 11,376 మంది హాజరు కాగా, 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించి 3 పరీక్షా కేంద్రాల్లో 37 మందికి గానూ 34 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 99.84 కాగా, సప్లిమెంటరీ విద్యార్థుల హాజరు 91.89 శాతంగా నమోదైంది. ఆయా సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లతో పాటు వైద్య సిబ్బందితో క్యాంపు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరిసరాలు సందడిగా మారాయి. కాగా పట్టణంలోని గోవిందుపల్లె వద్ద గల గౌతమి స్కూల్, బైపాస్ రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, పాత బస్టాండు వద్ద గల ప్రభుత్వ హైస్కూళ్లను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం

కోరుట్ల రూరల్, మార్చి 18: యూసుఫ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు పరీక్ష నిమిత్తం ఆర్టీసీ డిపో మేనేజర్ విజయమాధురి సోమవారం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. పదోతరగతి విద్యార్థులకు గ్రామం నుంచి అయిలాపూర్‌లోని పరీక్షా కేంద్రానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ గుగ్గిల్ల ప్రియాంక, డిపో మేనేజర్‌ను కోరగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు పరీక్షా కేంద్రానికి బస్సులో వెళ్లి వచ్చారు.

యూసుఫ్‌నగర్‌లో ఆర్టీసీ బస్సులో పరీక్షకు బయలుదేరుతున్న విద్యార్థులు

పొలాస సెంటర్ వద్ద హాల్ టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

కథలాపూర్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న అధికారులు

జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, జిల్లా విద్యాధికారి

పసుపు @ 15,111

మెట్‌పల్లి, మార్చి 18: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పసుపు ధరలు కొంత నిరాశపర్చాయి. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.15,111, కనిష్ఠంగా రూ.5 వేలు, పసుపు గోళకు గరిష్ఠంగా రూ.15,001, కనిష్ఠంగా రూ.5,548, పసుపు చూరకు గరిష్ఠంగా రూ.13,555, కనిష్ఠంగా రూ.4 వేలు పలికింది.

రైలు ఢీకొని బర్రెలు మృతి

జగిత్యాల రూరల్, మార్చి 18: జగిత్యాల పట్టణంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో సోమవారం రైలు ఢీకొనడంతో రెండు బర్రెలు మృతి చెందాయి. 10వ వార్డు లింగంపేటకు చెందిన ఆవునూరి నర్సయ్యకు చెందిన రెండు బర్రెలు లింగంపేట రైల్వే ట్రాక్ దాటుతుండగా నిజామాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే గూడ్స్ రైలు ఢీ కొనడంతో మృతి చెందాయి. రూ.80వేలు నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు రైతులకు శిక్షణ

సారంగాపూర్, మార్చి18: మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో మంగళవారం రైతులకు వివిధ పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ నిర్వహిస్తున్నట్లు మండల విస్తరణాధికారి వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెళకువలు, ఆయిల్ పామ్ సాగు, వేసవిలో కూరగాయల సస్యరక్షణ, మందుల వాడకంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సుఖవ్యాధులపై అవగాహన

కోరుట్ల, మార్చి 18: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రభుత్వ ప్రాథమిక దవాఖానలో సోమవారం సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, జాగ్రత్తలు సూచించారు. 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త పరీక్షలు చేశారు. ఇక్కడ ఐసీటీసీ కౌన్సిలర్ మల్లికార్జున్, ఎస్ఎస్‌కే మేనేజర్ సంతోశ్, ల్యాబ్ టెక్నీషియన్ సాజిద్ అలీ, శ్రావణి, తదితరులున్నారు.

గాలికుంటు టీకాలు

మేడిపల్లి, మార్చి 18: పశువుల డాక్టర్ వెన్నెల మాచాపూర్, దమ్మన్నపేటలో సోమవారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుందన్నారు. పశువులన్నింటికీ తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవో సురేఖ, వీఏ లచ్చయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, ADAPELLY VINEETHA, R/o. 2-123/1/1, Seetharampur, Karimnagar, TS. Changed My Name as CHATTA VINEETHA, W/o. Adapelly Rakesh.
NT-328422

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు

సారంగాపూర్: స్నపనం పూజలు నిర్వహిస్తున్న పండితులు

మల్లాపూర్: కుస్తాపూర్‌లో నంది విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

సారంగాపూర్, మార్చి 18: పెంబట్లలోని దుబ్బ రాజేశ్వరస్వామి అనుబంధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వస్తి పుణ్యాహవచ నాంకురార్పణ, యాగశాల ప్రవేశం, ఉత్సవమూర్తులకు స్నపనం, ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రెండో రోజైన మంగళవారం మధ్యాహ్నం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో వడ్లూరి అనూష, ట్రస్ట్ ఫౌండర్ పొరండ్ల శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మడేలయ్య వార్షికోత్సవం

కోరుట్ల రూరల్, మార్చి 18: అయిలాపూర్‌లోని మడేలయ్యస్వామి 15వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల వేడుకల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంగాధర్, నాయకులు పిడుగు సందయ్య, బాబురావు, అల్వాల లక్ష్మి, రజక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నంది విగ్రహ ప్రతిష్ఠాపన

మల్లాపూర్, మార్చి 18: కుస్తాపూర్‌లోని గ్రామ ప్రధాన కూడలి వద్ద రామలింగేశ్వర ఆలయ కమిటీ, గ్రామస్తుల సమష్టి సహకారంతో సోమవారం నంది విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, మాజీ సర్పంచ్ ద్యాగ గంగారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, కమిటీ సభ్యులు బాయి నర్సయ్య, గడ్డం రాజన్న, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మార్చి 18: చింతలపేటలో ఐదు రోజులుగా కొనసాగుతున్న మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆలయంలో అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కాగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఘనంగా రాజరాజేశ్వర కల్యాణం

కోరుట్ల రూరల్, మార్చి 18: మాదాపూర్‌లోని రాజరాజేశ్వర కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య-రాజేశ్ దంపతులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు గడ్డం ఆదిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మల్లాపూర్, మార్చి 18: రాఘవపేటలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం ఘనంగా జరిగింది. పురోహితుడు మాధవచార్యుల ఆధ్వర్యంలో అభిషేకం, దీపారాధన, దేవతస్థాపనం, మండలస్థాపన, తదితర ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మరో మూడు రోజులు పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఇక్కడ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, నాయకులు దేవ మల్లయ్య, ఏనుగు రాంరెడ్డి, కమిటీ సభ్యులు నారాయణ, లక్ష్మణ్, రాజేందర్, మహిపాల్, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

జగిత్యాల/సారంగాపూర్/మేడిపల్లి, మార్చి 18: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, దీంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శైలజ, అంగన్‌వాడీ సీడీపీవో వీరలక్ష్మి పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి, సారంగాపూర్ మండలం రంగపేట, మేడిపల్లి మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ప్రభుత్వం అందజేస్తున్న నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

కరాటే బెల్టులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

జగిత్యాల రూరల్, మార్చి 18: కరాటే అనేది ఆత్మరక్షణ కోసమే కాకుండా శారీరక, మానసిక దృఢత్వానికి చాలా ఉపయోగపడుతుందని కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, అకాడమీ డిన్యూటీ గ్రాండ్ మాస్టర్ సిహన్ కె వసంత్ కుమార్ పేర్కొన్నారు. మౌంట్ కార్మెల్ స్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్ అకాడమీ శిక్షకుడు నరేశ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే జిల్లా అధ్యక్షుడు మర్రిపెల్లి శ్రీనివాస్, సీనియర్ మాస్టర్ లింగయ్య, పీఈటీ హరీశ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యం

మల్లాపూర్, మార్చి 18: నిజామాబాద్ ఎంపీగా అర్వింద్ ఐదేండ్లుగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి శూన్యమని, రానున్న ఎంపీ ఎన్నికల్లో ఆయనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఐదు గ్యారెంటీలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. ఇక్కడ రాష్ట్ర నాయకుడు కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తమ్మ ఉన్నారు.

రాజన్న ఆలయ నూతన కమిటీ

నూతనంగా ఎన్నికైన రాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ

పెగడపల్లి, మార్చి 18: మండలకేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక సోమవారం స్థానిక ఆలయంలో ఏకగ్రీవంగా జరిగింది. ఎంపీటీసీ బొమ్మెన జమున, మాజీ సర్పంచ్ మేర్గు శ్రీనివాస్ సమక్షంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వొరుగల శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి రాంచంద్రం, ఉపాధ్యక్షులుగా గర్వంద రాజశేఖర్‌గౌడ్, కట్ల శ్రీనివాస్, కోశాధికారిగా భోగ గోపికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా మాదారపు కిషన్‌రావు, ప్రచార కార్యదర్శులుగా మాసూరి పార్థసారథి, జక్కుల మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా 20 మంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గజ్జెల స్వామి, గుజ్జుల ప్రసాద్‌రెడ్డి, కరుణాకర్‌రావు, రాజు, నర్సింహారెడ్డి, గంగారెడ్డి, పోచయ్య, వెంకట్రావు, వెంకటేశం, ప్రవీణ్‌రావు, సాగర్‌రావు, వెంకటరమణ, రమేశ్, రాజేశం, ప్రశాంత్, సుధాకర్, కమలాకర్ ఉన్నారు.

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలేవి..?

జగిత్యాల, మార్చి 18: ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామన్న ప్రధాని మోదీ.. ఇప్పటివరకు ఎంత మందికి కొలువులు కట్టబెట్టారో చెప్పాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశంసించారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే దేశంలోనూ పునరావృతమవుతాయని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తెలంగాణలో బీజేపీ అకౌంట్ కూడా ఓపెన్ చేయబోదని జోస్యం చెప్పారు. రైతులు, మహిళలు, యువతను మోదీ విస్మరించారని, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి, అమ్మకానికి పెట్టారని ధ్వజమెత్తారు. విదేశాల్లోని నల్లధనం తీసుకువచ్చి దేశంలోని ప్రతి పేదవాడి ఖాతాల్లో రూ.15 లక్షలు జమచేస్తామని చెప్పిన మోదీ, ఇప్పటివరకు రూ.15 కూడా జమచేయలేదన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కోనేరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్

ధర్మపురి, మార్చి18: ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ధర్మపురిలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. గోదావరి నది ఒడ్డును, స్వామివారి తెప్పోత్సవం, డోలోత్సవం నిర్వహించే కోనేరులో ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దినేశ్, ఉత్సవ కమిటీ సభ్యుడు జక్కు రవీందర్, నాయకులు ఉన్నారు. కాగా ధర్మపురికి చెందిన కట్కం స్టూడియోస్ ఆధ్వర్యంలో 'ఓ అంబేద్కరుడా.. మీకు పోటీ ఎవరూ' అనే పాట పోస్టర్‌ను సోమవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోస్టర్‌తో పాటు ప్రోమోను కూడా ఆవిష్కరించారు. పాటను చిత్రీకరించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పాట నిర్మాత శారద, కట్కం నరేందర్, గాయకులు శాంతాకుమారి, గంగాధర్‌నాయక్, నాయకులు ఉన్నారు.

త్వరలోనే రోడ్డు పనులు పూర్తి

కొడిమ్యాల/మల్యాల, మార్చి 18: మండలంలోని పూడూర్ నుంచి కొడిమ్యాల డబ్బుతిమ్మాయిపల్లి వయా జగిత్యాల వరకు రోడ్డు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే పూడూర్‌లో రోడ్డు పనులను పరిశీలించారు. మరమ్మతు పనుల కోసం ఆరు నెలల క్రితమే రూ.5 కోట్ల 40 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. కాగా చెప్యాలకు చెందిన నాలుగు నెలల చిన్నారి సాన్వి ఇటీవల మృతి చెందింది. దీంతో ఎమ్మెల్యే చిన్నారి కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశాడు. కాగా మల్యాల మండలం ముత్యంపేటకు అనుబంధంగా ఉన్న కొండగట్టు దిగువ ప్రాంతానికి చెందిన పసుపులేటి శ్రీకాంత్ ఇటీవల వెంకటాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, శ్రీకాంత్ కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.5 వేలను అందజేశారు. కాగా ఎమ్మెల్యే సూచనల మేరకు ఇరిగేషన్ అధికారులు నూకపల్లి క్రాస్ రెగ్యులేటర్లను లేపి దిగువకు నీటిని విడుదల చేశారు.

ఎంపీవోపై దాడికి నిరసన

జగిత్యాల రూరల్/రాయికల్, మార్చి 18: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవోపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం జగిత్యాల రూరల్, అర్బన్, రాయికల్ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ అధికారిపై ఎంపీపీ దాడి చేసి కొట్టడం అమానుషమన్నారు. ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో పంచాయతీ అధికారుల సంఘం అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, ఎంపీడీవోలు రమాదేవి, విజయలక్ష్మి, చిరంజీవి, ఎంపీవోలు సలీం, సుష్మ, పర్యవేక్షకులు గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 18: జగిత్యాల బార్ అసోసియేషన్‌కు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 20 నుంచి 21 వరకు నామినేషన్ల ప్రక్రియ, 22న నామినేషన్ల పరిశీలన, 23న నామినేషన్ల ఉపసంహరణ, 28న ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి, విజేతను ప్రకటిస్తామని కమిటీ పేర్కొంది.

పోటాపోటీగా నామినేషన్లు

మెట్‌పల్లి, మార్చి 18: మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా వివిధ పదవులకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం నామినేషన్ల స్వీకరణలో భాగంగా అధ్యక్ష పదవికి పుప్పాల లింబాద్రి, పుప్పాల భానుమూర్తి, తెడ్డు సురక్ష, ఏలేటి రాంరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి ఎల్మల రాంబాబు, ప్రధాన కార్యదర్శి పదవికి కట్కం వేణుగోపాల్, తునికి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శికి రాంపెల్లి జగన్, లైబ్రరీ కార్యదర్శికి కోట రాజారెడ్డి, కల్చరల్ కార్యదర్శికి మగ్గిడి నర్సయ్య, మూడు సీనియర్ ఈసీ మెంబర్లకు, మూడు జూనియర్ ఈసీ మెంబర్లకు ఒక్కొక్క నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెంకటనర్సయ్య, భూమేశ్వర్, వెంకటస్వామి తెలిపారు.

వాల్‌పోస్టర్లు ఉండొద్దు

కథలాపూర్, మార్చి 18: గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న గోడలపై, విద్యుత్ స్తంభాలపై రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు ఉండకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం పోతారం, తాండ్ర్యాలలో ఆయన పర్యటించారు. అక్కడక్కడ రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు కనిపించడంతో వాటిని సిబ్బందితో తీయించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

వెలమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

జగిత్యాల, మార్చి 18: తెలంగాణలో వెలమ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన, నిరుపేదల అభివృద్ధి కోసం ప్రత్యేక వెలమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వెలమ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు యాచమనేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు, కోశాధికారి దామోదర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రావణ్ రావు, కోటేశ్వర రావు, గోపాడి సురేందర్ రావు, మెన్నెని సురేందర్ రావు, కిరణ్ రావు, బెజ్జంకి అజిత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 18: అంతర్గాం గ్రామానికి చెందిన నాగులపల్లి అశ్విత ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలు కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

తనను మళ్లీ తీసుకెళ్లాలని కోరినందుకు..

మాజీ భర్త చేతిలో వివాహిత హత్య

కరిపె అంజలి (ఫైల్)

మల్యాల, మార్చి 18 : గతంలో ప్రేమించి పెళ్లి చేసుకుని మనస్పర్థలతో విడిపోగా, తనను మళ్లీ తీసుకెళ్లాలని కోరినందుకు ఆమెను మాజీ భర్త గొంతు నులిమి హత్య చేశాడు. మండలంలోని మ్యాడంపల్లి గ్రామ శివారులో ఘటన జరుగగా, సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్యాల సీఐ నీలం రవి, ఎస్ఐ అబ్దుల్ రహీంలు తెలిపిన వివారాల ప్రకారం... సిద్దిపేటకు చెందిన కరిపె అంజలి(24), జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన కొల్లూరి నరేశ్ గతంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికి మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత అంజలి మరో వివాహం చేసుకున్నది. అయితే, ఆదివారం అంజలి జగిత్యాలకు వచ్చి మాజీ భర్త అయిన నరేశ్‌ను కొత్త బస్టాండ్ ప్రాంతంలో కలుసుకుంది. ఈ క్రమంలో తనను ఎలాగైనా అగ్గిమల్లకు తీసుకువెళ్లాలని ప్రాధేయపడగా నరేశ్ సర్ది చెప్పాడు. ఆ తర్వాత తన వాహనంపై ఎక్కించుకుని, మళ్లీ సిద్దిపేటకు బస్సు ఎక్కించేందుకు గొల్లపల్లి మీదుగా మల్యాల ఎక్స్‌రోడ్ వైపు బయలుదేరారు. ఈ క్రమంలోనే మ్యాడంపల్లి గ్రామ శివారులోకి చేరుకునే క్రమంలో అంజలి, నరేశ్ మధ్య వివాదం తలెత్తింది. దీంతో కోపోద్రిక్తుడైన నరేశ్ మద్యం మత్తులో అంజలి గొంతు నులిమి హత్య చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయని పోలీసులు తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని మల్యాల సీఐ నీలం రవికుమార్, ఎస్ఐ అబ్దుల్ రహీం పరిశీలించడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు. ఇదిలా ఉండగా నరేశ్ నేరుగా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు విశ్వసనీయ సమాచారం.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

మేడిపల్లి, మార్చి 18: రంజాన్ పండుగను పురస్కరించుకొని పోరుమల్ల గ్రామంలో ఆదివారం రాత్రి నాయకుడు పెద్దిరెడ్డి ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఇఫ్తార్ విందులో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి పాల్గొన్నారు. వారి వెంట ఆర్బీఎస్ మాజీ మండలాధ్యక్షుడు మిట్టపెల్లి భూమారెడ్డి, మాజీ సర్పంచ్ ఈర్నాల సంపత్‌కుమార్, నాయకులు ఉన్నారు.

పద్మశాలీ కార్యవర్గం ఎన్నిక

మారుతీనగర్, మార్చి 18: మెట్‌పల్లి పట్టణ పద్మశాలీ సేవా సంఘం18వ వార్డు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మపురి నందకుమార్, ఉపాధ్యక్షుడిగా గోలి సుధాకర్, కార్యదర్శిగా సాంబారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గుంటుక అనిల్, కోశాధికారిగా గుంటుక శ్యామ్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ రాజరత్నాకర్, కట్కం గంగారాం, కార్యవర్గ సభ్యులుగా కట్టకోల నరేందర్, అల్లె రవి, మిట్టపల్లి సాయి, చెన్న సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

మెట్‌పల్లి, మార్చి 18: పట్టణంలోని విజయసాయి సెంట్రల్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన ప్రదర్శనలకు ప్రశంసలు వెల్లువెత్తాయి. విశ్రాంత ఎంఈవో రవీందర్, పలువురు విద్యావేత్తలు హాజరై విజ్ఞాన ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్యం వెలుగులోకి వచ్చేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పుల్ల ప్రదీప్‌గౌడ్, డైరెక్టర్ పుల్ల లక్ష్మి, పుల్ల శ్రీరాం, భూపాల్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.